# కల్పన

**వివాహం మనిషి జీవితంలో షరతులు లేని ఒప్పందం. ఆ ఒప్పందం జరిగేక ఒకరిపై మరొకరు షరతులు విధించుకుంటే - ఏముంది? షరతులలో కూడిన చిక్కుముడి అయిపోతుంది జీవితం.**

నా జీవితం అలాంటి చిక్కుముడి. విడదీయబోయి, ముడి విడదీసుకునే నేపథ్యంలో అసలు ముడే విడివడిపోయి, నా భార్య నా నుండి విడివడిపోయింది. జీవితం పీటముడి అయిపోయింది.

కాకినాడ బస్ స్టాండ్‌లో 'శాంతి ఆశ్రమం' బస్సులు వెళ్లేచోట కూర్చుని వున్నాను. ప్రతి మనిషీ ఏదో ఒక కంగారు ఒకరికన్నా మరొకరు ముందు వెళ్ళిపోవాలి. ఆరాటం, బ్రతుకు పోరాటం... గంట సేపటి నుండి బస్ కోసం చూస్తున్నాను. కనీసం ఇరవై బస్సులు వెళ్ళిపోయి వుంటాయి. బస్సులు వెళ్ళిపోతే బస్ స్టాండ్ ఖాళీ అయిపోతుందనుకుంటున్నాను. కాని కావడం లేదు.

నా దృష్టి దూరంగా ఒక బల్లమీద చివరకు కూర్చున్న స్త్రీ మీద పడింది. అవును. నా నుండి విడివడిన నా జీవన సహచరి. నాలాగే చాలా పెద్దదైపోయింది. ఇంకో బస్‌కి వెళ్ళవచ్చునుకుని ఆమె దగ్గరకు వెళ్ళాను.

"మీరు - నువ్వు కల్పన కదూ" తల ఎత్తింది.

చందమామ లాంటి తెల్లని, గుండ్రటి ముఖం. కళ్ళ క్రింద నల్లని చారలు. విశాలమైన కుంకుమ లేక నుదురు వెన్నెలలో చంద్రబింబం లేని ఆకాశంలా వుంది నుదురు.

అదేమిటి? ఏమయింది? నన్ను నిశితంగా చూస్తున్న ఆమె కళ్ళల్లో కన్నీటి పొరలు గమనించాను. "మీరు కళ్యాణ్" అంది గొంతు పెగల్చుకుని. నా కన్నీటి తెరలలో, అక్కడక్కడ తెల్లని జుట్టుతో నిండిన గిరజాల జుట్టు, పెద్దదైనప్పటికి యింకా అందంగా వున్న కల్పన రూపం, చెదిరిపోతూ ఒక రూపం దాల్చుకుంటూ కనుపిస్తోంది. ఆ గిరజాల ముంగురుల

కోసం పరితపించి, ఆమెను నా దాన్ని చేసుకున్నాను. పెళ్ళయిన కొత్తల్లో ఆమె ముఖాన్ని ఎప్పుడూ నా ముఖంపై గిరజాల జుట్టుతో కప్పేసేలా వుంచమని మారాం చేసేవాణ్ణి. పాత జ్ఞాపకాలతో కల్పన ఎదురుగా నిలబడి వున్నాను. అప్పుడే బస్ స్టాండ్ కొద్దిగా ఖాళీ అయింది.

"కూర్చోండి" అంది కల్పన ప్రక్కన చేయి చూపిస్తూ.

దాదాపు మూడు దశాబ్దాల తరువాత నేను, ఒకనాటి నా సహచరి దగ్గర కూర్చున్నాను. మనసు, వయస్సుతో సంబంధం లేకుండా ఆనందంతో కళ్లాలు విప్పుకుని పరుగులు పెడుతోంది. ఏమిటీ జీవితం?

"కళ్యాణ్ జీవితంలో పెళ్ళి అనేది ఒక గౌరవప్రదమైన నాటకం. ఆ నాటకంలో భార్య భర్త తమ తమ పాత్రల యొక్క పరిధి, అనుసరించవలసిన విధులు, హక్కులు, సముచిత నటన మర్చిపోయారనుకోండి. నాటకం రసాభాస అవుతుంది. విఫలమవుతుంది." కల్పన గతం తవ్వుతూంది.

అవును. కల్పన నా నుండి ఎందుకు విడివడిపోయింది?

పెళ్లయి నా కల్పన ఇంటికి వచ్చినప్పటి నుండి, నా కల్పనకు ఎండ పొడ తగలకూడదు అని నా ముఖ్యోద్దేశ్యం. ఎప్పుడూ 'ఇది కావాలి' అని కల్పన అడగలేదు. సామాన్యంగా ఆడవాళ్ళు చీరలు, నగలు కావాలని భర్తలను వేధిస్తుంటారు. కాని మా సంసారిక జీవితంలో అలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదు. కాని తను సంసారాన్ని నడుపుతాననీ, తనకు పూర్తిగా ఆర్థిక స్వాతంత్ర్యం కావాలనీ, బజారు పనులన్నీ తనే చూసుకుంటాననీ మారం చేసేది.

ఏం చేస్తారో ఏమిటో - చెప్పరు - నాకు భార్యగా సముచిత స్థానం లేదు సంసారంలో - ఎందుకు? చీరలు నగలు వుండగానే సరేనా? అవును. స్వాతంత్ర్యం లేని స్త్రీ బ్రతుకు కూడా ఒక బ్రతుకేనా? ఇవి ఆమె అభిప్రాయాలు.

నేను ఎన్నోసార్లు నచ్చచెప్పాలని ప్రయత్నించాను. నాకు విలువలేదు. కాదు, నాకు మీరు విలువ ఇవ్వడం లేదు. ఎందుకొచ్చిన బ్రతుకు ఇలా కొనసాగింది రెండేళ్ళు.

పగలంతా ఒకరినొకరు దెప్పిపొడుచుకోవడం, అసహ్యించుకోవడం, ఛీ... ఛీ... అనుకోవడం, రాత్రి అయ్యేసరికి పడకమీద, ఒక బలహీన క్షణంలో శృంగారం. ఎందుకు? ఈ కుళ్ళిపోయిన సంసారం అనిపించింది. పిల్లలు పుట్టకుండానే ఎవరిదారి వాళ్ళు చూసుకుంటే మంచిదని ఇద్దరం విడిపోయాం.

"కళ్యాణ్ ఏమిటాలోచిస్తున్నారు?"

నా మనస్సును కాస్సేపు ఉక్కిరి బిక్కిరి చేసిన గతంలోంచి వర్తమానంలోకి వచ్చాను.

కల్పన ఏదో చెప్తోంది.

"మీ నుండి విడాకులు తీసుకున్నాక, నేను తప్పుచేశానని తెలుసుకునేటప్పటికి పూర్తిగా ఊబిలోకి దిగిపోయాను. నన్ను ఒక విశాల హృదయుడు పెళ్ళి చేసుకుంటానన్నాడు. నా పరిస్థితి చూసి జాలిపడి కాదని, మనస్ఫూర్తిగా, మనసారా నన్ను కోరుకుంటున్నానని నన్ను వెంటాడాడు. చివరకు ఎలాగో వప్పుకున్నాను. కాని తరువాత తెలిసింది. అతనికి కావలసింది నా అందమైన శరీరం అని, నా శరీరంతో అతను ఆడుకోవడం కోసం నన్ను వశపరచుకున్నాడనీ.

అతనికి స్త్రీ అంటే చులకన, డబ్బు పడేస్తే స్త్రీ ఎంత పనైనా చేస్తుందనీ, ఎంతమందితోనైనా తిరుగుతుందనీ, స్త్రీలందరూ నీచులనీ అతని అభిప్రాయం. నన్ను హింసించి ఆనందం పొందేవాడు. ఆ దుర్మార్గుడి ద్వారా పిల్లలను కని, ఆ మనస్తత్వంతో పుట్టే పిల్లలతో మరికొన్ని జీవితాలు బాధ పడకూడదని, పిల్లలు పుట్టకుండా జాగ్రత్త పడ్డాను.

అతనికి లేని చెడు అలవాటు లేదు. పరిచయం లేని స్త్రీలు లేరు.

అతనొక శాడిస్ట్. ఆ శాడిస్ట్‌తో కాపురం చేసి చేసి అలసిపోయాను. భగవంతుడు కరుణించి రెండేళ్ళ క్రితం అయన్ను తీసుకుపోయాడు. రామచంద్రపురంలో ఆయన స్వంత ఇంట్లో వుంటున్నాను. కళ్యాణ్ నీకు ద్రోహం చేసాను. మల్లెపువ్వులా నువ్వునన్ను చూసుకుంటుంటే, అహంకారంతో ఎగిరెగిరి పడ్డాను. అందుకు భగవంతుడు నన్ను కఠినంగా శిక్షించాడు.. కళ్యాణ్ మీ శ్రీమతి" అంది కల్పన.

"కల్పనా వెనకటికి ఒక సామెత వుంది. పెద్దలు చెప్తుంటారు. రోలెళ్ళి మద్దెలతో చెప్పుకుందని, అలా వుంది మన ఇద్దరీ సంగతి. నువ్వు వెళ్ళి పోయాక చాలా రోజులు నిగ్రహంతో కాలక్షేపం చేశాను. కాని మనసు నిలబడటం లేదు. ఈలోగా నా పదవి చూసి వ్యామోహంతో, నా ఆఫీసులో పనిచేసే అమ్మాయి నన్ను వలలో వేసుకుంది. తోడు లేని నాకు, ఆదరణ, ఆప్యాయత, అనురాగం పంచి యిస్తానని వాగ్దానం చేసింది. చివరకు ఇద్దరం వివాహం చేసుకున్నాం.

పెళ్ళి అనేది ఒక ప్లస్. ఒక మైనస్ కలిస్తే వెలిగే విద్యుత్ కాంతి లాంటిది. రెండు విభిన్న ధృవాలు ఒక్కసారిగా జీవితంలో ఒక్కటిగా జత చేయబడతాయి. సామాన్యంగా నూటికి

తొంభై తొమ్మిది శాతం భిన్నధృవాలే. వివాహం అయ్యేక భిన్న ధృవాలు ఒకటయే అవకాశాలు దాదాపు మృగ్యం. అయితే చాలా మంది ఒకటయ్యేమని నటిస్తారు. ఇదంతా ఒక నాటకం. ఒక కవి చెప్పినట్లు నరుని బ్రతుకు నటన. వివాహం అయ్యేక కొద్ది నెలల్లో తేలిందేమిటంటే, ఆమె నా డబ్బు, హోదా కోసం చేసుకుందని... ఎప్పుడూ నా డబ్బు - మీ డబ్బు కాసేపు మౌనంగా వుంటే మీ కల్పన గుర్తుకు వస్తోందా? దాన్ని ఎందుకు వదిలేశారు? దాన్నే వుంచుకోపోయారా? మీరు నన్ను పెళ్ళి చేసుకున్నారు కాబట్టి, అందునా రెండో పెళ్ళి కాబట్టి, నా జీతం నేను దాచుకుంటాను. మీ జీతం ఖర్చుచేయండి. నా జీతంలో పైసా యివ్వను. నేను ఎక్కడికి వెళ్ళినా ఏం అడగకూడదు. నేను మగాడిలా ఉద్యోగం చేస్తున్నాను కాబట్టి. మీతో సమానం. మీరు నా మీద అధికారం చెలాయించడానికి వీలులేదు. ఇవి ఆమె ఆలోచనలు అభిప్రాయాలు.

ఆనాటి నుండి భార్య అంటే చిరాకు వచ్చింది. ఆప్యాయత, అనురాగం, ఆదరణ, లాలింపు కరువైపోయింది. దాహం, ఒకటే దాహం. ఈ దాహం యిక తీరదు. ఆమెను పట్టించుకోవడం మానేశాను.

ఒక శుభోదయాన ఎవడితోనే వెళ్ళిపోయింది. నేను మగాణ్ని కాదని సాకు పెట్టి వెళ్ళిపోయింది. నేను మగాణ్ని కాదు కాబట్టే నా మొదటి భార్య నన్ను వదిలి వెళ్ళిపోయిందని ప్రచారం చేసింది. తన తప్పు కప్పి పుచ్చుకోడానికి, పోయిన సంవత్సరమే రిటైరయ్యాను. రిటైరయ్యాక వచ్చిన డబ్బు బ్యాంక్‌లో డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో కాలక్షేపం చేస్తున్నాను.

శాంతి ఆశ్రమంలో డబ్బు కట్టి ఒక గది తీసుకున్నాను. జీవితాంతం అక్కడే వుండవచ్చును. ఎప్పుడూ అక్కడే వుంటాను.

నీతో గడిపిన మధుర క్షణాలు గుర్తుచేసుకుందామని అప్పుడప్పుడు కాకినాడ వచ్చి - బీచ్ రోడ్ , బీచ్ పార్క్, ఆనంద్ థియేటర్ కాంప్లెక్స్ - మసీదు సెంటర్, జగన్నాథపురం బ్రిడ్జ్ - ఇవన్నీ సందర్శించి వెళ్తుంటాను. ఎక్కడైనా నువ్వు కనిపిస్తావేమోనని ఆశ. మనిషి ఆశతోనే గదా జీవించేది. నిరాశా నిస్పృహలతో జీవించే మనిషికి ఆశ అమృతం లాంటిది.

ఆ ఆశ అనే అమృతం నిత్యం సేవిస్తూ బ్రతుకు వెళ్లదీస్తున్నాను.

కల్పనా - మనిషికి జీవితంలో పెళ్ళి అనేది, జీవన సహచరి అనేది పెద్దలు ఎందుకు నిర్దేశించారో, మనిషికి ఏభై సంవత్సరాలు పైబడ్డాక తెలుస్తుంది. అప్పుడు శారీరక సంబంధంతో పనిలేని ప్రేమానురాగాలు, లాలింపు, ఆదరణ, ఆప్యాయత, ఒకరంటే ఒకరు వదిలి వుండలేని

స్థితి వస్తుంది. సరిగ్గా మగాడికీ, ఆడదానికీ, ఏభై సంవత్సరాలు వయస్సు దాటేకే, ఒకరి అవసరం మరొకరికి వుంటుంది.

ఆ వయసులో భార్యలేని భర్త జీవితం, భర్తలేని భార్య జీవితం వ్యర్థం. ఊహించలేనటువంటిది"

కల్పన కొంగుతో కళ్లు తుడుచుకుంటూంది. బస్ స్టాండ్‌లో పాన్ షాపులో పెద్ద కుంకుమ్ స్టిక్కర్స్ తీసుకువచ్చాను.

"కల్పనా యివి తీసుకో"

"ఎందుకు" అవి చూసింది. నుదుట పెట్టుకోమని సైగ చేసాను.

"శాంతి ఆశ్రమం బస్ వస్తోంది అదిగో - నువ్వు నా కూడా వస్తున్నావ్" అంటు ఆమె కోసం చూడకుండా వడివడిగా బస్ ఎక్కాను.

చీకటి వెనుక వెలుగు

వెలుగు వెనుక చీకటి

వెలుగూ, చీకటీ లేకపోతే జీవితం లేదు.

నా ప్రక్కన కూర్చుని వున్న కల్పన నుదుట కుంకుమ స్టిక్కర్ ఉదయ సంధ్యాకాశంలో సూర్యునిలా మెరుస్తోంది.

తోడు దొరికిన నా జీవిత నౌక ఎగిరెగిరి పడుతోంది సంతోషంతో.

బస్ బయలుదేరినట్లుంది. బస్ స్టాండ్ గతుకుల్లో బస్ ఎగురుతూంది.

కల్పన నా మీద పడిపోతూ కొత్త పెళ్ళి కూతురులా సిగ్గుపడుతోంది.

***